సాక్షి నిజామాబాద్

శనివారం : 29 : మార్చి : 2025



కాంగ్రెస్ పాలనలో..

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.

- 10లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:34	ఆది : 4:50

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.4 /20.8

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



సాక్షి కవితలకు ఆహ్వానం..

తెలుగు ప్రజల నూతన సంవత్సరాది ఉగాది. ఈ పండగకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఉగాది ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 'సాక్షి' కవితలను ఆహ్వానిస్తోంది. 10 లైన్లకు మించకుండా మీ కవితను పంపండి. మీ ఫొటోను జత చేయండి. ఎంపిక చేసిన కవితలను ఉగాది రోజున ప్రచురిస్తాం..

కవితలు పంపించాల్సిన వాట్సాప్ నంబర్ :

998 9709 595

న్యూస్‌రీల్

ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)కు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రాథమిక జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రాథమిక జీవనాధార వ్యక్తి మరణించినట్లయితే, అతని వయస్సు 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా రూ.20,000 ఆర్థిక సహాయం అందజేయబడుతుందని, అర్హులు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

కారులో పసుపు చోరీ



బాల్కొండ: హైటెక్ పద్ధతిలో కల్లాల్లోని పసుపును చోరీ చేస్తున్న మెండోరా మండలం వెల్కటూర్ తండాకు చెందిన ఓ వ్యక్తిని ముప్కాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కొంతకాలంగా ముప్కాల్ మండలం నాగంపేట్, కొత్తపల్లి గ్రామాల శివారులోని కల్లాల నుంచి పసుపు కొమ్ములు అపహరణకు గురవుతున్నాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు.. దుండగులను పట్టుకునేందుకు ప్రణాళిక రూపొందించారు. నిత్యం మధ్యాహ్నం వేళలో కల్లాల వద్ద అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని గమనించి, వెల్కటూర్ తండావాసిగా గుర్తించారు. నిందితుడి ఇంటిపై ఓ కన్నేసి ఉంచారు. నిత్యం తన సాంట్రో కారులో నాలుగు బస్తాల పసుపు కొమ్ములు తీసుకురావడం గమనించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా రూ.5 లక్షల విలువైన పసుపును దొంగిలించి మెట్‌పల్లి మార్కెట్‌లో విక్రయించినట్లు దుండగుడు ఒప్పుకున్నట్లు తెలిసింది. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

క్రికెట్‌లో పీజీ ఫస్టియర్ జట్టు విజయం

- క్రికెట్ ఫైనల్స్ ప్రారంభించిన వీసీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ యాన్యువల్ డే-2025 క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం క్రికెట్ ఫైనల్స్‌ను వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, స్వయంగా బ్యాటింగ్ చేసి ఉత్సాహపరిచారు. రసవత్తరంగా సాగిన ఫైనల్స్‌లో పీజీ ఫైనలియర్ జట్టుపై 18 పరుగుల తేడాతో పీజీ ఫస్టియర్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ జీ బాలకిషన్, ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, నరేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 22,904 మంది విద్యార్థులకుగానూ 22,842 మంది హాజరుకాగా, 62 మంది గైర్హాజరయ్యారు.





ఇదిగో మంజూరు.. అదిగో గడువు !

- యాంత్రీకరణ పథకంపై రైతులకు సమాచారమివ్వని అధికారులు
- సబ్సిడీ యంత్రాల కోసం జిల్లాకు రూ.1.17కోట్లు
- మూడు రోజుల క్రితం నిధుల కేటాయింపు
- ఎల్లుండి వరకే దరఖాస్తులకు అవకాశం

డొంకేశ్వర్(ఆర్మూర్): సాగులో రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రారంభించింది. కానీ, పథకంపై ప్రచారం, రైతులకు సమాచారం లేకుండానే నిధులు కేటాయించింది. సబ్సిడీపై యంత్రాలు ఇచ్చేందుకు మూడు రోజుల కిందట జిల్లాకు రూ.1.17 కోట్లు మంజూరు చేసింది. మొన్ననే నిధులిచ్చిన ప్రభుత్వం రైతులు దరఖాస్తు చేసుకోవడానికి ఎల్లుండి (మార్చి 31) వరకే అవకాశం కల్పించడం గమనార్హం. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల ఏవోలు ప్రకటనలు చేయలేదు. చాలామంది రైతులకు ఈ విషయం తెలియక దరఖాస్తులు చేసుకోవడం లేదు. ఆరేళ్ల క్రితం నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం మళ్లీ ప్రారంభమైందనే సంగతి రైతులకు తెలుపకుండా అధికారులు గోప్యత పాటిస్తున్నారు.

31తో ముగింపు

2024–25 ఆర్థిక సంవత్సరానికి మాత్రమే ప్రభుత్వం జిల్లాకు రూ.1.17 కోట్లు మంజూరు చేసింది. రైతులు దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 31వ తేదీకి గడువు విధించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే మంజూరైన నిధులను ఖర్చు చేయాలి. లేదంటే ల్యాప్స్ అయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరు చేసిన నాలుగు రోజులకే దరఖాస్తులకు గడువు పెట్టడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్‌ను సంప్రదించగా, గడువు ముగింపుపై సరైన స్పష్టత ఇవ్వలేదు.

జిల్లాకు 534 యూనిట్లు..

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందించేందుకు ప్రభుత్వం జిల్లాకు 534 యూనిట్లు మంజూరు చేసింది. అందులో 15 రకాలకు పైగా యంత్రాలున్నాయి. కొన్నింటికి 50 శాతం సబ్సిడీ ఉండగా, మరికొన్నింటికి పరిమిత సబ్సిడీ మాత్రమే ఉంది. నిజామాబాద్ అర్బన్ మినహాయించి మిగతా ఐదు నియోజకవర్గాలకు ఒకటి చొప్పున ట్రాక్టర్ యూనిట్ ఉంది.

అలాగే జిల్లాకు డ్రోన్ యూనిట్ ఒకటి మాత్రమే ఉంది. వ్యవసాయ పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలంటే మండలాల్లోని ఏవోలను సంప్రదించాల్సి ఉంటుంది. రైతుకు సంబంధించిన పట్టాపాసు పుస్తకం జిరాక్స్, ఒక ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి ఏవోలకు రెండు రోజుల కిందట లాగిన్ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మంది పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారో వ్యవసాయ శాఖ వద్ద సమాచారం లేదు.

కేటగిరీ వారీగా మంజూరైన యూనిట్లు

ట్రాక్టర్లు	5	బ్యాటరీ స్ప్రేయర్లు	150
డ్రోన్	1	పవర్ స్ప్రేయర్లు	152
మక్కలు పట్టే యంత్రం	1	రోటోవేటర్లు	80
పవర్ వీడర్స్	4	సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్	18
బ్రష్ కట్టర్స్	7		
పవర్ టిల్లర్లు	5	కల్టివేటర్లు	103
స్ట్రా బాయిలర్లు	4	బండ్ ఫార్మార్లు	5



కనిపించేదంతా నీరు కాదు !

ఈ చిత్రం చూస్తే రోడ్డుపై నుంచి నీరు పారుతున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇదంతా భ్రమే.. కొన్ని రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో రహదారులపై ఎండమావులు ఏర్పడుతున్నాయి. డిచ్‌పల్లి వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై ఇలా ఎండమావులు కనిపించాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

సిద్ధాపూర్ పనులు వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ తదితరులు

- ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష

నిజామాబాద్‌అర్బన్: వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్ పనుల ప్రగతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ల్యాండ్ అండ్ సర్వే తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న పనుల స్థితిగతులపై అధికారులు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి వసతిలేని తండాలు, అనేక గ్రామాలకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలువనుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అంకితభావంతో పనిచేయాలని అధికారులకు హితవు పలికారు. అటవీ భూముల సేకరణ ఇబ్బందికరంగా ఉన్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను అవలంబిస్తూ పనులకు ఆటంకాలు ఏర్పడకుండా ముందుకెళ్లాలని సూచించారు. అవసరమైతే రిజర్వాయర్ నిర్మాణ ప్రణాళికలో స్వల్ప మార్పులతోనైనా పనులను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. సరిపడా నిధులు అందుబాటులో ఉన్నందున పనులలో జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకానికి డెలివరీ చాంబర్ల నిర్మాణానికి అవసరమైన కొద్దిపాటి స్థలాన్ని ఇరిగేషన్ అధికారులకు కేటాయించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

రిజర్వాయర్ నిర్మాణ పనుల విషయంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా వెంటనే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ పథకం ప్రాధాన్యతను గుర్తిస్తూ, ఇప్పటికే సుమారు 280 పైచిలుకు ఎకరాల భూమిని కేటాయించామన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి వీలుగా విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, పనులలో వేగాన్ని పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్ మీనా, కామారెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎఫ్‌డీవో భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విచారణకు హాజరైన జీవన్‌రెడ్డి

- భూ కబ్జా కేసులో 4గంటలపాటు ప్రశ్నించిన మోకిల పోలీసులు
- తనపై అక్రమ కేసు బనాయించారని మాజీ ఎమ్మెల్యే ఆరోపణ
- విచారణకు సహకరిస్తానని వెల్లడి



మోకిల పీఎస్‌లో విచారణకు హాజరై వెళ్తున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

శంకర్‌పల్లి: భూ కబ్జా ఆరోపణలపై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. శంకర్‌పల్లి మండలం టంగటూర్‌లో ఆయన భూ కబ్జాలకు పాల్పడ్డారని సామ దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి 2024 మే 27న మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో జీవన్‌రెడ్డితోపాటు ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయిపై కేసు నమోదు కాగా.. వారికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జీవన్‌రెడ్డికి బెయిల్ రాకపోవడంతో తనను అరెస్టు చేయొద్దంటూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు జీవన్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని, విచారించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల కాపీతో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయన మోకిల ఠాణాకు చేరుకున్నారు. నార్సింగి ఏసీపీ రమణాగౌడ్ ఆధ్వర్యంలో సీఐ వీరబాబు జీవన్‌రెడ్డిని విచారించారు. సుమారు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. పోలీసుల ప్రశ్నలకు జీవన్‌రెడ్డి ఆచితూచి సమాధానం ఇచ్చారు. అవసరమైతే మళ్లీ పిలుస్తామని, అందుబాటులో ఉండాలని ఆయనకు సూచించారు.

పొలిటికల్ డ్రామా..

విచారణ అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను భూ కబ్జాలకు పాల్పడ్డాననేది కేవలం పొలిటికల్ డ్రామా అని కొట్టిపారేశారు. కబ్జాలకు పాల్పడడం కాంగ్రెసోళ్లకు అలవాటని, తమకు లేదని వ్యాఖ్యానించారు. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యానని స్పష్టం చేశా రు. ఎన్ని సార్లయినా విచారణకు వస్తానని తెలిపారు.

ఖాతాల్లో 'గల్ఫ్ భరోసా సొమ్ము'

- రూ.1.40 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేసిన సర్కారు
- జిల్లాలో 28 కుటుంబాలకు లబ్ధి



భరోసా సొమ్ము జమ అయినట్లు బాధిత కుటుంబసభ్యుని మొబైల్‌కు వచ్చిన సమాచారం

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబసభ్యుల ఖాతాల్లో గల్ఫ్ భరోసా సొమ్ము జమ అయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా 66 కుటుంబాలకు గల్ఫ్ భరోసా కింద రూ.3.30 కోట్లు కేటాయించగా, జిల్లాకు చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.1.40 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, ఖతర్, ఒమాన్, ఇరాక్ దేశాల్లో మరణించిన వలస కార్మికులకు ప్రభుత్వం గల్ఫ్ భరోసా కింద రూ.5 లక్షల సాయం ప్రకటించిన విషయం విదితమే. మొదట్లో 35 కుటుంబాలకు నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గల్ఫ్ మృతుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి పెట్టుకున్న అర్జీల పరిశీలన, ఇతరత్రా కారణాలతో ప్రస్తుతం 28 కుటుంబాలకే లబ్ధి చేకూరింది. బాధిత కుటుంబాలు ఇంకా ఏమైనా ఉంటే వారికి సాయం అందిస్తారని అధికార యంత్రాంగం వెల్లడించింది. కాగా గల్ఫ్ భరోసా పథకంలో నిజామాబాద్ జిల్లాకే ఎక్కువ నిధులు కేటాయించడం గమనార్హం.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మా నాన్న రాజేశ్వర్ గతేడాది ఖతర్‌లో మరణించాడు. అందుకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా మా ఖాతాలో జమ చేశారు. పేదరికంలో ఉన్న మాకు గల్ఫ్ భరోసా సొమ్ము విడుదల చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– పత్రి కీర్తి, ధర్మోరా

బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చాం

గల్ఫ్ బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికి భరోసా సొమ్ము జమ చేయడమే నిదర్శనం. గత ప్రభుత్వం గల్ఫ్ బాధితులను విస్మరించింది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత గల్ఫ్ కార్మికుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

– ఈరవత్రి అనిల్, చైర్మన్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్

కార్పొరేషన్‌కు కాసుల వరద

- రికార్డు స్థాయిలో పన్ను చెల్లింపులు
- ఒక్కరోజే రూ.1.38 కోట్లు చెల్లించిన నగరవాసులు
- ఎల్‌ఆర్‌ఎస్ రూపంలో రూ. 1.17కోట్లు
- 364 మందికి ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు
- 42 శాతం పన్నులు వసూలు



పన్ను చెల్లింపుదారులతో సందడిగా మారిన బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నగర కార్పొరేషన్‌కు పన్నులు, ఎల్‌ఆర్‌ఎస్ రూపంలో శుక్రవారం కాసుల వరద కురిసింది. ఆస్తి, నీటి పన్నులు, బకాయిలు చెల్లించేందుకు ఇందూరు నగరవాసులు బల్దియాకు తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలో నిలబడి పన్నులు చెల్లించారు. శుక్రవారం ఒక్కరోజే రూ.1.38 కోట్ల పన్నులు చెల్లించారు. ఈనెల 27న (గురువారం) రూ.78 లక్షలు వసూలు కాగా, రాష్ట్ర వ్యాప్తంగా జీహెచ్ఎంసీ మినహా ఇతర మున్సిపాలిటీల్లో ఇంత పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించలేదు. కాగా, ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు 42 శాతం పన్నులు వసూలు చేసినట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో రోజుకు రూ.కోటి..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం నగరవాసులు పెద్ద సంఖ్యలో టౌన్‌ప్లానింగ్ కార్యాలయానికి తరలివస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అనుమతికి గురువారం ఒక్కరోజే రూ.కోటి చెల్లించారు. శుక్రవారం 364 మంది ఎల్ఆర్ఎస్ అనుమతి పొందగా, రూ. కోటీ 17 లక్షల 80 వేలు వసూలయ్యాయి. కాగా, మొత్తం 33,484 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు కేవలం 3,206 దరఖాస్తులు అనుమతి పొందినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఇచ్చిన బకాయిలపై 90 శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 31లోపు పన్నులు చెల్లించాలి. సెలవు రోజుల్లో సైతం పన్నులు తీసుకుంటారు. అందుకోసం బల్దియాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తాం.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

125 సెల్‌ఫోన్లు అందజేసిన సీపీ

- ఫోన్ పోతే సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయాలి

ఖలీల్‌వాడి: సెల్‌ఫోన్‌లు పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో బాధితులు నమోదు చేసుకోవాల ని సీపీ పోతరాజు సాయిచైతన్య సూచించా రు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం 125 మంది బాధితులకు సెల్‌ఫోన్‌లు అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు వాడడంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల బారినపడొద్దని సూ చించారు. సెల్‌ఫోన్ పోతే www.ceir.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని, దీంతో త్వరగా పట్టుకోవచ్చని తెలిపా రు. సెల్‌ఫోన్ల రికవరీ కేసుల్లో కృషి చేసిన కానిస్టేబుళ్లు నవీన్, నజీమ్, ఆర్ సుష్మను సీపీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి , ఐటీ కోర్ ఆర్ఎస్సై నిషిత్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసిన సీపీ పోతరాజు సాయిచైతన్య

క్లుప్తంగా

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తున్న ఆర్ఎస్సై సోలోమన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుమారుడు కిరణ్‌రాజ్‌కు శుక్రవారం భద్రత ఎక్స్ గ్రేషియా రూపంలో రూ.16 లక్షల చెక్కును సీపీ సాయిచైతన్య అందజేశారు. డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ఆర్ఎస్సై తిరుపతి, ఆర్‌సీఐలు తిరుపతి, శ్రీనివాస్, సతీష్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పాషా, తదితరులు ఉన్నారు.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు తెయూ వీసీ యాదగిరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బట్టు సురేష్, బికోజీ, సిబ్బంది నరేష్, సతీష్, నవ్య, మౌనిక, దిగంబర్, మధులిక, పీరు, అశోక్, ఆసిఫ్, గులాబ్ తదితరులు పాల్గొన్నారు.





అహ్మదీబజార్‌లోని దుకాణాల వద్ద దుస్తులు, వివిధ సామగ్రి కొనుగోలు చేస్తున్న ముస్లిం మహిళలు

రంజాన్ సందడి

నిజామాబాద్ నగరంలోని నెహ్రూపార్క్, అహ్మదీబజార్‌లో రంజాన్ సందడి నెలకొంది. పండుగకు మూడు రోజులు మాత్రమే సమయం ఉండడం, రంజాన్ మాసంలో శుక్రవారం చివరి రోజు కావడంతో రాత్రివేళ ముస్లింలు దుస్తులు, వివిధ వస్తువులు కొనుగోళ్లు చేపట్టారు. దీంతో నెహ్రూపార్క్, అహ్మదీబజార్‌లోని దుకాణాలు క్రయవిక్రయాలతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా దుస్తులు, గాజులు, పింగాణి వస్తువులు, టోపీలు, అత్తర్లు, పాదరక్షలు, రోల్డ్‌గోల్డ్ వస్తువులను ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్‌లోనే రంజాన్ సందడి ఎక్కువగా కనిపిస్తుంది. నగరానికి చుట్టుపక్కల ప్రాంతాలైన నిర్మల్, భైంసా, కామారెడ్డి, బాన్సువాడ నుంచి ముస్లింలు షాపింగ్ కోసం నిజామాబాద్ మార్కెట్‌కు వస్తుంటారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలోని నెహ్రూపార్క్‌లో రాత్రివేళ ముస్లింల సందడి




నగరంలోని అహ్మదీబజార్‌లో..

కాంగ్రెస్ పాలనలో నష్టపోతున్న రైతులు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీల అమల్లో ఘోరంగా విఫలమయిందని ఆరోపించారు. నగరంలోని ధర్నాచౌక్‌లో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొట్కూరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో 'రైతు సత్యాగ్రహ దీక్ష' నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అకాల వర్షాలు, కరెంట్ కొరత కారణంగా పంటలు ఎండిపోయిన రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుపై కాంగ్రెస్ నేతలు అసహనం చూపుతున్నారని, కానీ పసుపు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి, సకాలంలో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, భరత్ భూషణ్, ప్రదీప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



నగరంలో ఫూట్‌మార్చ్ చేస్తున్న సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. నగరంలోని జమా మసీద్, బర్కత్‌పురా, మాలపల్లి, ఆటోనగర్, శంభుని గుడి, గురుద్వారా తదితర ప్రాంతాలలో గురువారం అర్ధరాత్రి సీపీ పెట్రోలింగ్ నిర్వహించారు. అలాగే శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఫూట్ మార్చ్ నిర్వహించి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా నమాజ్ కార్యక్రమానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా జరిగేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐలు రఘుపతి, ప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 44వ నెంబర్ జాతీయ రహదారిని శుక్రవారం సీపీ సాయిచైతన్య పరిశీలించారు. అనంతరం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు న్యాయం చేసేవిధంగా పోలీసులు ఉండాలన్నారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, నేషనల్ హైవే అధికారిసిబ్బంది రామారావు, విరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' స్వయం ఉపాధి పథకానికి జిల్లాలోని వెనుకబడిన వర్గాల బీసీ, ఈబీసీ, (ఈడబ్ల్యూఎస్), ఫెడరేషన్‌లకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో సూచించారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణం పొందవచ్చని అన్నారు. రూ.50వేల లోపు విలువ చేసే యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ, రూ.లక్ష లోపు యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ, రూ.2లక్షల యూనిట్‌కు 80శాతం సబ్సిడీ, రూ.4 లక్షల వరకు విలువ చేసే యూనిట్‌కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. 21–55ఏళ్ల లోపు అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపన కోసం, 21–60 ఏళ్లలోపు అభ్యర్థులు వ్యవసాయ ఆధారిత పథకాలకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లయితే కుటుంబ వార్షిక ఆదాయము రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

బస్వాపూర్‌లో దొంగల బీభత్సం

- తాళాలు వేసిన తొమ్మిది ఇళ్లలో చొరబడ్డ దుండగులు
- సుమారు రూ.15లక్షల బంగారం, నగదు అపహరణ



బస్వాపూర్‌లో దొంగలు ధ్వంసం చేసిన బీరువా

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని తాళాలు వేసిన తొమ్మిది ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.15లక్షల వరకు బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గుర్తుతెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి గ్రామంలోకి చొరబడి సీసీ కెమెరాల కేబుల్స్‌ను కత్తిరించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక ఇల్లు తర్వాత ఇంకో ఇల్లు తాళాలు పగులగొడుతూ సుమారు తొమ్మిది ఇళ్లలో చోరీ చేశారు. దాకి రమేశ్ అనే వ్యక్తి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, వెండి వస్తువులను దొంగిలించారు. పక్కన ఉన్న నాగమణి ఇంట్లో మూడు తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మామిడి సత్తమ్మ ఇంట్లో అర తులం బంగారం, రూ.5 వేలు నగదు, సుజాత ఇంట్లో రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. సువర్ణ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు, మన్నె దర్మరాజు ఇంట్లో తులం బంగారం, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. చంద్రయ్య ఇంట్లో తులం బంగారం, రూ.పది వేల నగదు, చింత వినయ్ ఇంట్లో రూ.6 వేలు నగదు, సొన్నాయల స్వామి ఇంట్లో నగదు, ఇళ్ల ముందు ఉన్న బైకును కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మొత్తంగా సుమారు రూ.15 లక్షల విలువైన బంగారం ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాలకు వెళ్లి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బాల్య వివాహం నిలిపివేత

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌కు చెందిన బాలికకు త్వరలో జరుగనున్న వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు గురువారం రాత్రి నిలిపివేశారు. పెర్కిట్‌లో 10వతరగతి చదువుతున్న బాలికకు తల్లిదండ్రులు ఇటీవల వివాహం నిశ్చయం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు 1089 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐసీడీఎస్ అధికారులు జోత్స్న, షీటీం సభ్యులు పెర్కిట్‌కు చేరుకొని బాలిక తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది శ్రీదేవి, తార తదితరులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థకు నిధులివ్వండి



వేల్పూర్: విత్తనాభివృద్ధి సంస్థకు నిధులివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి విన్నవించారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్దా గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై వినయ్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన కూలీలు మీర్జా సలీమ్‌బేగ్, మహమ్మద్ అస్లామ్, మహమ్మద్ అన్వర్‌లు పని ముగిశాక జన్నెపల్లి నుంచి నిజామాబాద్‌కు వెళ్లేందుకు ఆటోలో ఎక్కారు. పాల్దా శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఆటోను ఢీకొనడంతో ఆటోలోని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

2.1 కిలోల గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలో ఎండు గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి, 2.1కిలోల(2100 గ్రాములు) గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ విలాస్ తెలిపారు. నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన సోహెబ్‌ఖాన్ నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలోని జన్నేపల్లి రోడ్డులో రైల్వేగేట్ వద్ద ఎండు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతడి సెల్, బైక్‌తోపాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని అరెస్ట్ చేసి, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో అప్పగించినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై సింధు, సిబ్బంది కిరణ్‌కుమార్, గోపి, నర్సయ్య చారి, సీలీరాజు, సాగర్‌రావు, సుధీర్, దశ పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో గుర్తుతెలియని యువకుడి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని గుర్తుతెలియని యువకుడు కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. ఖలీల్‌వాడి ఏరియాలో నిర్మాణంలో ఉన్న భవనంలో సదరు యువకుడు పని చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సింగ్ లేదా సర్దార్‌గా కనబడుతున్నాడన్నారు. నెహ్రూ పార్క్ ఏరియా దగ్గర ఉన్న లేబర్ అడ్డా దగ్గర నుంచి పనికి వెళ్తా ఉంటాడని తెలిపారు. ఎవరైనా యువకుడి వివరాలు తెలిస్తే ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

డిచ్‌పల్లి సీఐ, జక్రాన్‌పల్లి ఎస్సైపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేసి సివిల్ తగాదాల్లో తలదూర్చిన డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ మహేందర్‌లపై కేసు నమోదు చేయాలని జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన రావుట్ల ఆలియాస్ రాగుట్ల నచ్చన్న శుక్రవారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. అలాగే కేసు వాపసు తీసుకోవాలని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతిలతోపాటు భూమిని కబ్జా చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఏటీఎం చోరీకి యత్నించిన దుండగుల అరెస్టు



డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి శివారులోగల ఎస్‌బీఐ ఏటీఎంలో ఇటీవల చోరీకి యత్నించిన ఇద్దరు దుండగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నడిపల్లికి చెందిన రుద్రబోయిన గణేష్, కామారెడ్డికి చెందిన నిమ్మబోయిన సురేష్ గురువారం అర్ధరాత్రి ఎస్‌బీఐ ఏటీఎంను పగులగొట్టి అందులోని డబ్బులు చోరీ చేయడానికి యత్నించారు. అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకోగా నిందితులు పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన డిచ్‌పల్లి సీఐ, ఎస్సైలు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారు. విచారణ జరుపగా ఏటీఎం చోరీకి యత్నించినట్లు అంగీకరించారు. నిందితులు గణేష్, సురేష్‌లు పాత నేరస్తులు. జైలులోనే ఇద్దరికి స్నేహం కుదరడంతో బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలను పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది కేసులకు సంబంధించి వీరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నగరంలో మహిళ దారుణ హత్య

- తన తల్లికి చెడు వ్యసనాలు అలవాటు చేస్తోందని హతమార్చిన దుండగుడు
- మృతదేహాన్ని కారులో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



కమల (ఫైల్)

నిజామాబాద్ రూరల్: నగరంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. నిందితుడు మృతదేహాన్ని కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ సురేష్, ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. కంఠేశ్వర్ బైపాస్ నుంచి దాస్‌నగర్ కెనాల్ కట్టవైపు వెళుతున్న ఓ కారు సిగ్నల్స్ వద్ద ఆపకపోవడంతోపాటు, కారు డిక్కీలోని కవర్ బయటకు కనబడటంతో పోలీసులకు అనుమానం వచ్చి వెంబడించారు. మాక్లూర్ పోలీసులు కారును ఆపగా, డిక్కీలో మహిళ మృతదేహం ఉండటంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని నిందితుడు రాజేష్‌ను అదుపులోకి తీసుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతురాలు ముబారక్ నగర్ ప్రాంతానికి చెందిన బింగి కమల(46)గా గుర్తించారు. ముబారక్ నగర్‌కు చెందిన రాజేష్ వాళ్ల అమ్మకు అదేప్రాంతానికి చెందిన కమల చెడు వ్యసనాలు అలవాటు చేస్తోంది. దీంతో ఆగ్రహించిన రాజేష్ గురువారం కమలను కంఠేశ్వర్ బైపాస్ లోపలికి తీసుకెళ్లాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగగా రాజేష్ కమలను బండరాయితో మోదీ హత్య చేశాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని కాలువలో పడేయడానికి కారు డిక్కీలో పెట్టి బయలుదేరాడు. మృతదేహానికి కప్పిన కవర్ బయటకు రావడం, సిగ్నల్స్ వద్ద కారు ఆపకపోవడంతో పోలీసులు అనుమానం వచ్చి అతడిని పట్టుకున్నారు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాంగ్రాలో మరో మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రా కల్లుబట్టి సమీపంలో ఓ మహిళ హత్యకు గురైంది. సీఐ శ్రీనివాసురాజు తెలిపిన వివరాలు ఇలా.. పాంగ్రా కల్లు బట్టి సమీపంలోని ఇంట్లో నివాసముంటున్న చంద్రకళ(50)కు తన కూతురు మౌనిక నాలుగు రోజులుగా ఫోన్ చేసిన స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన మౌనిక శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా చంద్రకళ హత్యకు గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధంతో దాడి చేసి హత్య చేసినట్లు, ఈనెల 23న ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు మహిళ ఒంటిపై ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు పలువురు యువకులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

రెండేళ్ల బాలుడు..



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ పాలిటెక్నిక్ గ్రౌండ్ ప్రహరీ పక్కన గుర్తు తెలియని బాలుడు(2)ని కొట్టి చంపిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. టౌన్ సీఐ శ్రీనివాసరాజు తెలిపిన వివరాలు ఇలా.. పాలిటెక్నిక్ గ్రౌండ్ ప్రహరీ పక్కన ఓ టిప్పర్ నిలిపి ఉండగా, మూత్రవిసర్జనకు వెళ్లిన ఓ వ్యక్తి బాలుడి మృతదేహాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని దుండగులు మధ్యాహ్న సమయంలో బాలుడిని టిప్పర్ వెనుకాలకు తీసుకుని వెళ్లి రాయితో కొట్టి చంపినట్లు పేర్కొన్నారు. బాలుడి ఆనవాళ్ల కోసం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



చిన్నపోతంగల్‌లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని చిన్న పోతంగల్ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పుప్పాల భాగ్యలక్ష్మి(45)కి 18ఏళ్ల క్రితం ఆదే గ్రామానికి చెందిన రాములుతో వివాహం జరిగింది. వీరికి పిల్లలు పుట్టలేదు. భాగ్యలక్ష్మి గత కొన్నేళ్లుగా పలు వ్యాధులతో బాధపడుతుంది. ఈక్రమంలో గురువారం రాత్రి భోజనాల అనంతరం భర్త నిద్రపోయాక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై తేలింది. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని నందిగామ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. నందిగామ గ్రామానికి చెందిన కర్రోల్ల పోశెట్టి(43) తాగుడుకు బానిసై, తరచూ భార్య రోజాతో గొడవపడేవాడు. ఈనెల 27న రాత్రి దంపతుల మధ్య మళ్లీ గొడవ జరగడంతో తాగిన మైకంలో పోశెట్టి శివారులోని కొత్తకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నిజాంసాగర్ మండలంలో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన గూల కిష్టయ్య(30) మత్స్యకార్మికుడిగా జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన కిష్టయ్య శుక్రవారం గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

- పలువురిపై కేసులు నమోదు



గాంధారి (ఎల్లారెడ్డి): మండల పరిధిలోని తిప్పారం గ్రామంలో శుక్రవారం వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేసి పలు ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ అమాయకుల వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఫిర్యాదులు రావడంతో సోదాలు చేసినట్లు తెలిపారు. సోలంకి సాయిరాం, ఊగిలే ఆనంద్ రావు, బంగారువాడి బాలయ్య ఇళ్లలో పలు ప్రామిసరీ నోట్లు, దస్తావేజులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: దోమకొండ మండలం చింతమాన్‌పల్లి శివారులో గురువారం వేకువజామున ఈరబోయిన రమేష్ (38)అనే వ్యక్తి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో అతడిని తీవ్రంగా కొట్టి హత్య చేసిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. ముత్యంపేట గ్రామానికి చెందిన రమేష్ తన కారును డిసెంబర్‌లో రూ.3.85 లక్షలకు చింతమాన్‌పల్లికి చెందిన పల్లె పోచయ్యకు విక్రయించాడు. కారుపై తీసుకున్న లోన్‌కు సంబంధించిన వాయిదాలు, మిగిలిన డబ్బుల చెల్లింపుల విషయంలో ఇదివరకే పలు సార్లు ఇరువురి మధ్య గొడవ జరిగింది. రమేష్ గురువారం వేకువజామున చింతమాన్‌పల్లి శివారులో పోచయ్య నిర్వహిస్తున్న ఇటుకబట్టీ వద్దకు వెళ్లి తన కారును తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడే నిద్రపోతున్న పోచయ్య లేచి రమేష్‌ను అడ్డుకున్నాడు. పోచయ్య అతని బంధువు హరి, ఇటుకబట్టీలో పనిచేసే కూలీలు రమేష్, రాజు, బిదేశీ నాయక్‌లు కలిసి రమేష్‌పై కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు రమేష్‌ను కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.